క్లుప్తంగా

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సహాయ కార్యదర్శిగా మద్దుల



కొవ్వూరులో మద్దుల సత్యనారాయణను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కొవ్వూరు: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన మద్దుల వీరవెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం ఆయన జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు నాళం వీర వెంకట శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్, చెక్కా శ్రీనివాస్, కొల్లేపర శ్రీనివాస్, వంకాయాల శివరామకృష్ణ, తీగెల రవి, మానేపల్లి రమేష్, పలుకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోగి వైద్యానికి 'మానవత' సాయం

తాళ్లపూడి: అనారోగ్యంతో బాధపడుతున్న రోగికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆర్థిక సాయం చేసింది. పెద్దేవం గ్రామానికి చెందిన సాధనాల మురళి పక్షవాతంతో బాధపడుతూ కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో అతడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. ఐదు వేలను మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు తిగిరిపల్లి దోశాలు, ననపల రాజశేఖర్, తుంపూడి నాగభూషణగుప్త, నరాలశెట్టి నారాయణమూర్తి, ఎం.సూర్యచంద్రం, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

రజకుల నిరసన

కొవ్వూరు: దేవరపల్లిలో రజకుల కుల వృత్తికి కేటాయించిన చెరువు పునరుద్ధరణ పనులు తమ సంఘం ద్వారా చేయించుకునే అవకాశం కల్పించాలని కోరుతూ కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబుకు రజక సంఘ ప్రతినిధులు సోమవారం వినతి పత్రం అందజేశారు. చిలకపల్లి కట్లయ్య, లింగాల వీరభద్రరావు ఆధ్వర్యంలో వారు ఆర్డీవోను కలిశారు.

'స్పందన'కు 13 అర్జీలు

స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 13 అర్జీలు అందాయని ఆర్డీవో తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం సాయంత్రం 4.30 నుంచి ఐదు గంటల వరకూ డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్న కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఏవైనా సమస్యలుంటే 91009 54631 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

బాలికలు అదృశ్యం

పట్టణంలోని అచ్చాయమ్మ కాలనీకి చెందిన ఏడో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు ఆదివారం మధ్యాహ్నం అదృశ్యమయ్యారు. వారిద్దరూ స్థానిక సంస్కృత పాఠశాలలో చదువుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు.

కొవ్వొత్తులతో నిరసన

మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన హింసాకాండకు నిరసనగా పట్టణంలో ఆదివారం రాత్రి పాస్టర్ బొంతా మనోజ్ ప్రకాష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు.

రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ నూతన కార్యవర్గం ప్రమాణం

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం రాత్రి పట్టణంలోని నందిని ఆడిటోరియంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా బొల్ల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి చైనుల రాజా, కోశాధికారి కె. మనోజ్‌కుమార్‌లతో పాటు కార్యవర్గ సభ్యులతో ఇన్‌స్టలేషన్ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కిలిరు శివరామకృష్ణ, ఎం.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష.. శ్రమ లేదిక

- 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు
- రూపాయి ఖర్చు లేదు.. ఆఫీసులకు తిరిగే పనిలేదు
- నిడదవోలు పట్టణంలో 4,470 పత్రాల జారీ
- దరఖాస్తుదారుల్లో హర్షాతిరేకాలు



నిడదవోలులో మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు (ఫైల్)

నిడదవోలు: ప్రజల అర్హతలు, అవసరాలు తెలుసుకుని, వాటిని సకాలంలో సమకూర్చడం ప్రభుత్వం బాధ్యత. అలా నేరవేర్చగలిగేదే ప్రజా ప్రభుత్వం. ప్రజల మనసు తెలుసుకుని, అందుకు అనుగుణంగా పాలన సాగించే వాడే అసలైన లీడర్. అలాంటి నాయకుడే జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడు. అలాంటి ప్రజా నాయకులు నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయం. అర్హులై కూడా ఏకారణం చేతనైనా పథకాలు అందక నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్ళి సర్వే జరిపి ఏకారణంగా పథకం అందలేదో తెలుసుకుని, వారికి కావలసిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయిస్తున్నారు. అనంతరం అధికారులు యుద్ధప్రాతిపదికన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారు. నిడదవోలు పట్టణంలో జగనన్న సురక్ష కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆయా వార్డుల్లో పలు ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసిన వెంటనే జారీ చేస్తున్నారు. గతంలో ధ్రువీకరణ పత్రాలు కోసం తహసీల్దారు కార్యాలయానికి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న సురక్షతో తాము తాము గంటల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నామని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కుల, ఆదాయ, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం అధిక సంఖ్యలో ప్రజలు ముందుకొస్తున్నారు. వాటితో పాటు కుటుంబ, రేషన్ కార్డుల్లో పేర్ల మార్పు, ఆధార్ ఫోన్ లింక్, బయోమెట్రిక్, ఐరిష్ వంటివి చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నిడదవోలులో వార్డు సచివాలయాలు	13
వార్డులు	28
కుటుంబాలు	1409
సర్వే చేసిన కుటుంబాలు	4,539
వార్డుల్లో క్యాంపులు	07
జారీ చేసిన టోకెన్లు	4,702
జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు	4,470
కులధ్రువీకరణ పత్రాలు	1920
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	2,130
వివాహ ధ్రువీకరణ పత్రాలు	10
రైస్ కార్డులు	05
ఆధార్ సేవలు	400

రెండు పత్రాలు ఉచితంగా పొందాను



జగనన్న సురక్ష శిబిరం ద్వారా కుల,ఆదాయ, నివాస సర్టిఫికెట్లు పొందాను. వాస్తవంగా ఈ రెండు సర్టిఫికెట్ల కోసం రూ.500 ఖర్చవుతుంది. పైగా మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాలి. నాలుగు రోజుల క్రితం వలంటీర్ మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. ఇప్పుడు సర్టిఫికెట్లు పొందాను. ఖర్చు, శ్రమ లేకుండా పని జరిగింది.

–పేపకాయల కనకదుర్గ, శాంతినగర్, నిడదవోలు

ప్రభుత్వ సేవలు బాగున్నాయి



సురక్ష సర్వేలో వలంటీర్ ఇంటికి వచ్చి మీకు ప్రభుత్వం నుంచి ఏంకావాలని అడిగారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయించారు. శిబిరానికి నన్ను పిలిచి మరీ సర్టిఫికెట్లు అందించారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగితే కాని అవి వచ్చేవి కావు. కాని ఇప్పుడు జగన్ బాబు ప్రభుత్వంలో సర్టిఫికెట్లు పొందాను.

–వద్ది రమణ, 24 వార్డు, నిడదవోలు

కుల, నివాస సర్టిఫికెట్ పొందాను



కుల, నివాస సర్టిఫికెట్ లేక గత 20 ఏళ్లుగా ఇబ్బందులు పడ్డాను. గతంలో మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాను. కానీ రాలేదు. సురక్ష సర్వేలో వలంటీర్ వచ్చి నాక వసరమైన సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయించారు. ఖర్చు లేకుండా సురక్ష క్యాంపులో కుల, నివాస సర్టిఫికెట్ పొందాను.

–దాసరి మంగ, ఎస్టీ కాలనీ, నిడదవోలు

ఆదాయ సర్టిఫికెట్ తీసుకున్నాను



ఆదాయ సర్టిఫికెట్ లేనందున పిల్లల చదువుకు కొంత కాలం ఇబ్బందులు పడ్డాను. సర్వేలో వలంటీర్ ఇంటికి వచ్చినపుడు నా పరిస్థితి వివరించాను. ఈ క్యాంపులో పైసా ఖర్చు లేకుంగా ఆదాయ సర్టిఫికెట్ అందించారు. జగనన్న ప్రభుత్వంలో మాకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు.

–సయ్యద్ సుల్తానా, శాంతినగర్, నిడదవోలు

వివాహ సర్టిఫికెట్ ఇచ్చారు



నాకు ఇటీవల పెళ్ళయ్యింది. వలంటీర్లు ఇంటికి వచ్చినపుడు కల్యాణమస్తు పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలని చెప్పడంతో దానికి కావాల్సిన పత్రాలను అందించాను. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమంలో మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేశారు.కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకున్నాను.

–కె.వెంకట పద్మావతి, 04 వార్డు, నిడదవోలు

అవినీతి రహితంగా అర్హులందరికీ పథకాలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కంసాలిపాలెంలో గడప గడపకూ..



కంసాలిపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ అందుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కంసాలిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పథకాల పేరిట టీడీపీ నాయకులే ప్రజా ధనాన్ని దోచుకుతినేవారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ, వాటిని సక్రమంగా వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించే బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే అందజేశారు. గ్రామ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులను ఆయన ఆదేశించారు. గ్రామంలోని పలు సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వాల్‌పోస్టర్ల దహనం

- అనంతపల్లిలో వలంటీర్ల నిరసన
- వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్



పవన్ కల్యాణ్ వాల్‌పోస్టర్లు దహనం చేస్తున్న వలంటీర్లు

నల్లజర్ల: తమ పనితీరుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ బేషరతుగా తమకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం అనంతపల్లి గ్రామంలోని 36 మంది వలంటీర్లు నిరసనకు దిగారు. ఏలూరు సభలో ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతపల్లి ప్రధాన కూడలిలో తొలుత వారందరూ నిరసన తెలిపారు. అనంతరం పవన్ కల్యాణ్ వాల్‌పోస్టర్లను దహనం చేశారు. రాష్ట్రంలోని మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణమని పవన్ ఏవిధంగా చెబుతారని వలంటీర్లు ప్రశ్నించారు. ప్రధానంగా వంటరి మహిళలే లక్ష్యంగా వలంటీర్లు సమాచారం సేకరించి,దానిని సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారన్న పవన్ ఆరోపణ వాస్తవ విరుద్ధమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులు తప్ప, తాము ఎలాంటి అసాంఘిక చర్యలకూ పాల్పడటం లేదన్నారు. పవన్ తన వాఖ్యలను ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని వలంటీర్లు స్పష్టం చేశారు.

ఆసుపత్రికి మంచాల వితరణ

పెరవలి: మండలంలోని కానూరు ప్రభుత్వాసుపత్రికి లయన్స్ క్లబ్ పెరవలి శాఖ నాలుగు ఐరన్ మంచాలను విరాళంగా సమకూర్చింది. దాతలు వంక రాజకుమారి, కానూరుకు చెందిన ప్రవాస భారతీయుడు (ఎన్ఆర్ఐ) గారపాటి రామచంద్రరావు ఆర్థిక సాయంతో సోమవారం వాటిని అందించారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు మెరుగైన సేవలు అందించడానికి లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తుందని ఈ సందర్భంగా ఆ క్లబ్ అధ్యక్షుడు కోలా సీతయ్య నాయుడు అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు తేజశ్రీ, హేమరాజులతో పాటు మేడిచెర్ల శివకుమార్, బూరుగుపల్లి రాజు, సలాది ఉదయ భాస్కరరావు, శిరిగినీడి శేషగిరిరావు, ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యువతలో పాస్టర్లు పరివర్తన తేవాలి



నల్లజర్ల సీఐ రాజుకు యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం

నల్లజర్ల: యువత పెడదారి పట్టకుండా వివిధ సంఘాల పాస్టర్లు పరివర్తన తీసుకు రావాలని నల్లజర్ల సీఐ నున్న రాజు అన్నారు. యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తెలికిచెర్ల ఫెయిత్ చర్చిలో దైవ సేవకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు జె.ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో సీఐ రాజు మాట్లాడారు.ఇటీవల గ్రామాల్లో యువత గంజాయి, పేకాట, కోడిపందేలు, గంజాయి వంటి దురలవాట్లకు బానిసలై పక్కదారిపడుతున్నారన్నారు. అలాంటి వారిని సన్మార్గంలో నడిపించేందుకు పాస్టరు తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు. దైవ సేవకుడు లాజరస్ కూడా ప్రసంగించారు. అనంతరం సీఐ రాజును అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ముంగమూరి ప్రసాద్‌బాబు, కార్యదర్శి ఎం.ఇజ్రాయిల్ రాజు, కోశాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పలువురికి ధ్రువీకరణ పత్రాల పంపిణీ



దొరసానిపాడులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



పల్లంట్లలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న జీవీ

ద్వారకాతిరుమల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ నూరు శాతం మేలు జరుగుతోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దొరసానిపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, తహసీల్దార్ కె.సతీష్, ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలోని బీసీ కమ్యూనిటీ హాల్లో 07, 08 వార్డుల ప్రజలకు సోమవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. 458 కుల ధ్రువీకరణ పత్రాలు, 400 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అబ్దిదారులకు అందజేశారు. కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మీ, జేసీఎస్ టౌన్ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, పలువురు కౌన్సిలర్లు

దేవరపల్లి: పల్లంట్ల గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) జీవీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీవో డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన



వాటర్ ట్యాంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణంరాజు తదితరులు

ఉండ్రాజవరం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు చెప్పారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి అనువైన స్థలాన్ని సోమవారం ఆయన మండలంలోని తాడిపర్రు గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అదనపు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తాడిపర్రు గ్రామంలో రూ.2.24 కోట్ల వ్యయంతో 90 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మించడంతో పాటు పైపు లైన్లు, కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ డి.రామ్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, కార్యదర్శి పి.సత్యనారాయణ, వీఆర్వో లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

100 మంది పేదలకు అన్నదానం

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్ట గ్రామానికి చెందిన దర్శిత్ జన్మదినం సందర్భంగా సోమవారం నందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. నందన ఫౌండేషన్ ద్వారా ప్రతి నెలా కొందరు పేదలకు సాయం చేస్తున్నట్టు దేవరపల్లి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో విజయ్, సందీప్, జస్వంత్, ఎస్‌కే ఆలీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఊనగట్లలో ఫ్యామిలీ డాక్టర్

చాగల్లు: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌వో వరలక్ష్మి అన్నారు. మండలంలోని ఊనగట్ల గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వరలక్ష్మి పరిశీలించారు. సుమారు 55 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు పీఆర్ఎల్ దేవి , 104 వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పాస్ పోర్టు పోయినది

కేతా భూలక్ష్మి W/O రాంబాబు, కాకరపర్రు, పెరవలి, మండలం, తూ॥గో॥జిల్లా నేను పాస్‌పోర్ట్ నెం.P.1731345 ఇంట్లో పెట్టి చాలా కాలం తరువాత అవసరానికి ఎంత వెతికినా దొరకలేదు.. దొరికితే ఈ నెంబర్‌కి తెలుపగలరు. ఫోన్ నెం.95429 44679